నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 22 ఆగస్టు 2024 | SURYAPET

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 21 : డాక్టర్ బీఆర్ అంబేదర్క్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సులో అడ్మిషన్లకు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ నల్లగొండ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీతోపాటు పీజీ డిప్లొమో సర్టిఫికెట్ కోర్సులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరంతో పాటు పీజీ ద్వితీయ సంవత్సరం అభ్యర్థులు కూడా ఆయా కోర్సుల ఫీజులను ఇదే గడువులోగా చెల్లించాలని తెలిపారు. అడ్మిషన్లు, ఇతర వివరాలకు www.braouonline.in, www.braou.ac.in లోగానీ 9533101295, 7989339180 నంబర్లలోగానీ సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కోర్సులకు నల్లగొండలోని ఎన్జీ కళాశాల, దేవరకొండ ఎంకేఆర్ కళాశాల, మిర్యాలగూడ కేవీఎం కళాశాల, హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోదాడలోని కేవీఎం, సూర్యాపేటలో ఎస్వీ కళాశాల, రామన్నపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లగొండలో ఉమెన్స్ డిగ్రీ కళాశాల, పీజీ కోర్సులకు నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో అవకాశం ఉందని వివరించారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఆలేరులో 3వేల మందితో మహాధర్నా

- పాల్గొననున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- రుణమాఫీ కాని రైతులు అందరూ తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 21 : అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రుణమాఫీ రాని 3వేల మంది రైతులతో మహాధర్నాకు దిగుతున్నట్లు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ధర్నాలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, దేశ పతి శ్రీనివాస్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నట్లు చెప్పారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో మీడియాతో వాళ్లు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిసెంబర్ 9న భేషరతుగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చి ఇప్పుడు మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలైనా 60 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చెయ్యకుండా చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. రుణమాఫీకి రూ.40వేల కోట్లు ఖర్చవుతుందని చెప్పి ఆ తర్వాత రూ. 31 వేల కోట్లు అని మాట మార్చి బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. విడుదలకు వచ్చే సరికి అది రూ.18 వేల కోట్లు అయ్యిందని దుయ్యబట్టారు.

దీనిపై రైతులకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రుణమాఫీ మాఫీ జరుగని రైతులంతా మహాధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ బీర్ల మహేశ్, రైతుబంధు మాజీ డైరక్టర్ మిట్ట వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా బీఆర్ఎస్ రణం

అర్హులందరికీ రుణమాఫీ కోసం పోరుబాట

- నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలకు సన్నద్ధం
- నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలకు పర్పాట్లు
- పెద్దఎత్తున పాల్గొనేందుకు సిద్ధమవుతున్న రైతులు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిశానిర్దేశం

అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ మాఫీ అవ్వక తీవ్ర అవస్థలు పడుతున్న రైతాంగానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నది. కొర్రీలు లేకుండా రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమైంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులతో కలిసి ధర్నాలు చేసేందుకు గులాబీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రాల్లోని ఆర్డీఓ కార్యాలయాలు లేదా తాసీల్దార్ ఆఫీసుల ఎదుట రుణమాఫీ అందరికీ ఇవ్వాలన్న నినాదంతో పెద్దఎత్తున నిరసన తెలిపేందుకు సన్నాహాకాలు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి జరిగే ధర్నాలో రైతులకు మద్దతుగా ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు గ్రామ స్థాయి వరకు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వాస్తవానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాకపోవడం శోచనీయం.

– నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ)

ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6 లక్షల మంది వరకు లబ్ధిదారులు ఉంటారన్నది అంచనా. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకుని కుటుంబంలో ఒక్కరికే రెండు లక్షల రుణమాఫీ వర్తింప చేయడంతో దాదాపు రెండున్నర లక్షల మంది రుణమాఫీకి దూరమైనట్లు రైతు సంఘాల లెక్కలు చెప్తున్నాయి. ఇందుకు ఆధారంగా గతేడాది ఆగస్టులో కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీ లెక్కలను ముందు పెడుతున్నాయి. 2018 ఎన్నికల హామీలో భాగంగా కేసీఆర్ సర్కార్ 2023 ఆగస్టులో పాస్‌పుస్తకమే ప్రమాణికంగా రుణమాఫీ చేసింది. కేసీఆర్ పాలనలో రూ.99,999 వరకు అమలు చేస్తేనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4,00,518 మంది రైతులకు మొత్తం రూ.2159.77 కోట్ల రుణమాఫీ జరిగింది. ప్రస్తుతం రేవంత్ సర్కార్ రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించినా రైతుల సంఖ్య తగ్గడం గమనార్హం. ఇప్పుడు మూడు విడతల్లో కలిపినా 3.39 లక్షల మంది రైతులకే లబ్ధి జరిగింది. కేసీఆర్ హయాంలో లక్షలోపు రుణమాఫీ ఉన్న రైతుల సంఖ్య కంటే ఇది 60 వేలు తక్కువ. 2 లక్షల రుణమాఫీ అన్నాక అంతకు రెట్టింపు స్థాయిలో రైతులకు లబ్ధి జరుగాల్సింది పోయి ఇంకా తగ్గడం చర్చనీయాంశంగా మారింది. ఇక నల్లగొండ డీసీసీబీలో 58 శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగింది. డీసీసీబీ పరిధిలోని 107 సొసైటీల్లో రుణమాఫీకి అర్హులైన రైతులు 89,888 మంది ఉండగా ఇందులో రెండు లక్షల రుణమాఫీ అయిన రైతుల సంఖ్య 52,708 మాత్రమే. ఇంకా 37,180 మంది రుణమాఫీకి నోచలేదు. మొత్తం 499.98కోట్ల రుణాలకు గానూ రూ.279.76 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. రూ.220.22 కోట్ల రుణాల మాఫీ గురించి నేటికీ స్పష్టత లేదు. ఆర్థిక భారం తగ్గించుకునేందుకే రుణమాఫీని మ.మ. అనిపించాలని కాంగ్రెస్ సర్కార్ కుట్రలు చేసిందని రైతులు మండిపడుతున్నారు. రేషన్ కార్డులో ఎంత మంది ఉన్నా ఒక కుటుంబంలో గరిష్టంగా రెండు లక్షల రుణమాఫీ మించవద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రేషన్‌కార్డు లేని వారిని ప్రస్తుతానికి పక్కన పెట్టింది. దీనికి తోడు ఆధార్ సీడింగ్ లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఉన్న వారికి సైతం రుణమాఫీ కాలేదు. వారందరికీ ఎప్పుడు రుణమాఫీ వర్తింప చేస్తారన్నది ప్రశ్నార్థకంఆ మారింది. దాంతో బాధిత రైతులు నిత్యం బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. చెప్పులు అరిగేలా తిరుగుతున్నా ఎవరూ స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని, రుణమాఫీ కాకపోవడానికి కారణం చెప్పడం లేదని వాపోతున్నారు. సగం మందికి చేసి సగం మందిని దూరం పెట్టడం ఏంటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. అందులో భాగంగా బీఆర్ఎస్ తలపెట్టిన రైతు ధర్నాల్లోనూ పెద్దసంఖ్యలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి ధర్నాకు తరలిరండి

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ రైతులను దగా చేస్తున్నదని, రైతులంతా ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింప చేయకుండా రకరకాల కొర్రీలతో కోతలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులందరికీ రుణమాఫీ అందే వరకు రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అందరికీ రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ తలపెట్టిన ధర్నాలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. క్షేత్రస్థాయి నుంచి రైతులతో కలిసి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు ధర్నాల్లో కదం తొక్కి రైతు వ్యతిరేక ప్రభుత్వంపై రుణభేరి మోగించాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటల నుంచే ధర్నాలు ప్రారంభం అవుతాయని, సకాలంలో తరలిరావాలని సూచించారు.

3 గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల


మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

కేతేపల్లి, ఆగస్టు 21 : హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీకి వరద పోటెత్తుండడగా, ప్రాజెక్టు అధికారులు బుధవారం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు మూడింటిని ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. ఉదయం 843.97 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మధ్యాహ్నానికి 3,755.52 క్యూసెక్కులకు పెరుగడంతో ప్రాజెక్టు నీటి మట్టం 643.50(4.06 టీఎంసీలు)అడుగులకు చేరింది. అప్రమత్తమైన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు 2, 7, 8 వ నెంబరు క్రస్టు గేట్లను ఒక్కో అడుగు మేర ఎత్తి 1,935.29 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి కాల్వకు 168.89, ఎడమ కాల్వకు 216.86 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. నీటి విడుదల నేపథ్యంలో పరివాహక ప్రాంత ప్రజలు నదిలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

- కోప్పోలులో పర్యటించిన కలెక్టర్ నారాయణ రెడ్డి
- పశు వైద్య ఉపకేంద్రం లైవ్ స్టాక్ అసిస్టెంట్ సస్పెన్షన్

కోప్పోలు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గుర్రంపోడ్, ఆగస్టు 21 : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కోప్పోలు గ్రామంలో గల వివిధ ప్రభుత్వ సంస్థలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కింద చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను గ్రామమంతా తిరిగి పరిశీలించారు. అక్కడక్కడ మురికి కాల్వల్లో పిచ్చి మొక్కలు ఉండడాన్ని గమనించి వాటిని తీసివేయాలని, మురికి కాల్వలు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ మంజులను ఆదేశించారు. ఇదే విషయంపై జిల్లా పంచాయతీ అధికారి మురళితో ఫోన్లో మాట్లాడి అన్ని గ్రామాల్లో చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం పశు వైద్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను, మందుల స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. పశు వైద్య ఉప కేంద్రం దగ్గరికి వచ్చిన రైతులతో రుణమాఫీపై మాట్లాడి రుణమాఫీ అయ్యింది, లేనిది అడిగి తెలుసుకున్నారు. పశు వైద్య ఉపకేంద్రం లైవ్ స్టాక్ అసిస్టెంట్ మట్టయ్య విధులకు సరిగా రావడం లేదని, అంతేకాక పశువులకు చికిత్స సైతం సరిగా అందించడం లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తక్షణమే ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామంలో పర్టిలైజర్ యజమానులు అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డిని విచారణ చేసి యాక్షన్ తీసుకోవాలని తెలిపారు. విచారణ తరువాత వారి లైసెన్స్‌లను రద్దు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ మంజుల, వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

శాండ్ ట్యాక్స్‌లో మాత్రమే ఇసుక బుక్ చేసుకోవాలి

నీలగిరి : గృహ నిర్మాణంతోపాటు ఇతర అవసరాల కోసం ఇసుక అవసరం ఉన్న వారు కచ్చితంగా శాండ్ ట్యాక్స్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. నల్లగొండ నుంచి గుర్రంపోడ్‌కు వెళ్తున్న క్రమంలో బుధవారం పట్టణ శివారులో నల్లగొండకు వస్తున్న ఇసుక ట్రాక్టర్లను నిలిని వాటి అనుమతులు, లైసెన్స్ ఇతర వివరాలను తెలుసుకున్నారు. రసీదులు, ఆన్‌లైన్ బుకింగ్ తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రుణమాఫీ కాక పరడ రైతుల పాట్లు

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించిన అధికారులు
- 395 మందికి గానూ 254 మందికే రుణమాఫీ

కట్టంగూర్, ఆగస్టు 21 : వ్యవసాయ అవసరాల కోసం వివిధ బ్యాంకులు, సొసైటీల్లో తీసుకున్న రుణం మాఫీ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు ప్రభుత్వం వివిధ కారణాలతో మాఫీ చేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కట్టంగూర్ మండలం పరడ గ్రామ రైతులు 395 మంది ఈదులూరు ఏపీజీవీబీ, కట్టంగూర్ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో రూ.రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్నారు. మూడు విడుతల్లో 254 మందికి రుణమాఫీ కాగా మిగిలిన 141 మందికి కావాల్సి ఉన్నది. రుణాలు తీసుకున్న చాలా మంది అర్హులున్నప్పటికీ జాబితాలో వారి పేర్లు గల్లంతు కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ ఒట్టిదేనని తేలిపోయింది. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, పీఏసీఎస్, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి వారికి సరైనా సమాధానాలు రాకపోవడంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వ రకరకాల నిబంధనలు పెట్టడంతో రుణమాఫీ నోచుకోలేకపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తిరుమలగిరి మండల కేంద్రంలో బుధవారం ఏపీజీవీబీ ఎదుట రుణమాఫీ వివరాల కోసం రైతుల నిలీక్షణ

రేషన్‌కార్డు లేదని లోన్ మాఫీ చేయలేదు

నేను ఈదులూరు గ్రామీణ వికాస బ్యాంకులో పాస్‌బుక్ పెట్టి 1.40లక్షలు క్రాప్‌లోన్ తీసుకున్న. ఇప్పుడు అసలు, వడ్డీతో కలుపుకొని 1.60 లక్షలు అయ్యింది. కానీ రెండు లక్షల లోపు రుణ మాఫీలో నాపేరు లేదు. అధికారులను సంప్రదిస్తే రేషన్ కార్డు లేకపోవడంతో ఇప్పుడు మాఫీ కాలేదని చెబుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి షరతులు తేకుండా మాఫీ చేసిండ్రు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను తీవ్ర అన్యాయం చేస్తున్నది. రేషన్‌కార్డు ప్రామాణికం కాకుండా పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా రుణ మాఫీ చేయాలి.

- మార్త పుల్లారెడ్డి, రైతు, పరడ గ్రామం

కొందరికే మాఫీ చేసి ప్రభుత్వం మోసం చేసింది

గత ఎన్నికల్లో రైతులందరికీ రుణ మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొందరికే చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మోసి చేసింది. నాకు బ్యాంకులో రూ.1.60లక్షల పంట రుణం ఉంది. రుణమాఫీ అవుతుందని ఎంతగానో ఎదురు చూసిన. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లో నాకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని అడిగితే లేని పోని సమాధానాలు చెప్పున్నరు. రైతులను మోసం చేసి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నాయకులకు త్వరలోనే బుద్ధి చెప్తాం.

-వెన్న శ్రవణ్‌రెడ్డి, రైతు, మర్రిగూడెం, మాడ్గులపల్లి మండలం

మా ఇంట్లో ఇద్దరికీ రాలేదు

ఏక కాలంలో రెండు లక్షలు రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ప్రమాణం చేసి నేడు మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తగులుతుంది. రంగారెడ్డినగర్‌లో నాకు, నాభార్య పేరున 20 ఎకరాల సాగు భూమి ఉంది. మాకు చెరో 1.60 లక్షల పంట రుణం ఉంది. నిమ్మ, బత్తాయి నాలుగు ఎకరాల తోట ఉంది. పత్తి, వరి మరో 16 ఎకరాల్లో సాగు చేస్తా. ప్రభుత్వం రెండు లక్షల లోపు రుణమాఫీ లిస్టును ప్రకటించినా అందులో మాలో ఒక్కరిది కూడా లేదు. కనీసం కుటుంబంలో ఒక్కరికైనా మాఫీ అయితదని అనుకున్నాం. వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే మీ ఇద్దరిది కలిసి రెండు లక్షలు దాటుతుందన్నారు. ఇలాంటి వాటిపై ఇప్పటి వరకు మాకు ఎలాంటి గైడ్ లైన్స్ రాలేదని సమాధానం చెబుతున్నారు.

- బుచ్చిరెడ్డి, రైతు, రంగారెడ్డి నగర్, నల్లగొండ మండలం

కోదాడ పీఏసీఎస్‌లో 48 శాతమే రుణమాఫీ

కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహంపై రైతుల ఆగ్రహం

కోదాడ, ఆగస్టు 21 : ఎన్నికల ముందు ప్రతి రైతుకూ రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో 50 శాతం మందికి మాత్రమే రుణ మాఫీ చేస్తుండటం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోదాడ ప్రాథమిక సహకార పరిధిలో ఏడు గ్రామాలకు గానూ 2,380 మంది రైతులు రుణాలు తీసుకోగా అందులో 1,651 మందికే రుణమాఫీ అయ్యింది. దాంతో రైతులు ప్రాథమిక సహకార సంఘం, వ్యవసాయ అధికారులు చుట్టూ తిరుగుతూ తమ పరిస్థితి ఏంటని గోడు వెళ్లబోసుకుంటున్నారు. అధికారులు మాత్రం సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న పరిస్థితి. వారి వద్ద కూడా సమగ్ర సమాచారం లేదు. ఈ పీఏసీఎస్ పరిధిలో కోదాడ, తమ్మరబండపాలెం, గుడిబండ, కూచిపూడి, కూచిపూడి తండా, గణపవరం, తొగర్రాయి, కొమరబండ గ్రామాలు ఉన్నాయి. 2,380 మంది రైతులకుగానూ రూ.11,53,88,763 చెల్లించాల్సి ఉండగా, అందులో 1,651 రైతులకు రూ.7,77,96,301 మాత్రమే మాఫీ అయ్యింది. ముందు అందరికీ రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు రేషన్ కార్డు ఉన్న కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అంటూ నిబంధనలు పెడుతూ ఇబ్బందులు గురిచేయడమేనని రైతులు మండిపడుతున్నారు. రుణమాఫీ కోసం ఎంతో ఆశగా ఎదురు చూసిన రైతులకు నిరాశ ఎదురైంది.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ఎన్నికల్లో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నది. కోదాడ మండలంలో 50 శాతం రైతులకే రుణమాఫీ అయింది. అర్హత ఉన్నప్పటికీ నిబంధనల పేరుతో మాఫీ చేయకుండా మొండి చేయి చూపించేందుకు కుట్ర పన్నుతున్నది. అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అయ్యేదాకా ఆందోళనలు చేపడుతాం.

-పాట్ట కిరణ్‌కుమార్, బీఆర్ఎస్ మండల నాయకుడు, కోదాడ

ఎదురుచూపులే మిగిలాయి

రుణమాఫీ కోసం ఆరు నెలల నుంచి ఎదురు చూపులే మిగిలాయి. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లోనూ నాకు రుణం మాఫీ కాలే. మండల కేంద్రంలోని కో ఆపరేటివ్ బ్యాంకులో నాకున్న రెండున్నర ఎకరాలకు రూ.60వేలు రుణం తీసుకున్నా. మూడో విడుతలో పేరు వస్తుందని ఆశతో ఎదురు చూశా. ఇంత వరకు రాకపోవడం బాధగా ఉన్నది. గత బీఆర్ఎస్ హయాంలో ఇలా జరుగలేదు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. రైతుల ఉసురు పోసుకున్న ఏపార్టీ మనుగడ సాధించలేదు. ప్రజాపాలనంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

-బానోతు భరత్‌నాయక్, కాల్వపల్లితండా, మఠంపల్లి మండలం

మేళ్ల చెర్వు పీఏసీఎస్‌లో 60 శాతం మందికే రుణమాఫీ

మేళ్లచెర్వు, ఆగస్టు 21 : మేళ్లచెర్వు ప్రాథమిక సహకార సంఘంలో మూడు విడతల్లో 60 శాతం మందికే రుణమాఫీ జరిగింది. ఈ సొసైటీ పరిధిలో మండల కేంద్రంతోపాటు వేపల మాధవరం, వెంకట్రాంపురం, ఎర్రగట్టుతండా, హేమ్లాతండా, కప్పలకుంటతండా గ్రామాలకు చెందిన 4వేల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో రూ.2 లక్షల లోపు రుణాలను 1,143 మంది తీసుకున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో 691 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మిగిలిన 452 మందికి పలు కారణాలతో మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమకూ రుణమాఫీ వర్తింపజేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

22 మండలాల్లో వర్షం

- అత్యధికంగా మునుగోడులో 4.89 సెంటీమీటర్లు

నల్లగొండ రూరల్, ఆగస్టు 21 : ఉపరితల ద్రోణి ప్రభావంతో నల్లగొండ జిల్లాలో 22 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మునుగోడులో 4.89, అత్యల్పంగా కనగల్‌లో 0.3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. గుండ్లపల్లిలో 3.49, గట్టుపల్‌లో 3.40, చిట్యాలలో 2.85, చందంపేటలో 2.56, నిడమనూరులో 2.03 , నాంపల్లిలో 1.96, మర్రిగూడలో 1.66, దేవరకొండలో 1.44, పీఏపల్లిలో 1.36, కొండమల్లేపల్లిలో 0.96, చింతపల్లిలో 0.83, నల్లగొండలో 0.81, అనుములలో 0.76, గుర్రంపోడ్‌లో 0.68, చండూరులో 0.66, తిప్పర్తిలో 0.35, కట్టంగూర్‌లో 0.27, నార్కట్‌పల్లిలో 0.16, తిరుమలగిరి (సాగర్)లో 0.10, పెద్దవూరలో 0.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం 0.98 సెంటీమీటర్లు నమోదైంది.

యూజీ, పీజీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 21: నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలలో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు సెప్టెంబర్ 15 వరకు అవకాశం ఉందని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, స్టడీసెంటర్ కోఆర్డినేటర్ వెల